న్యూస్‌రీల్

గడ్డివాము దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జయపురం: బొయిపరిగుడ సమితి రెంగాలగుడ గ్రామంలోని ఒక కళ్లంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు ఎకరాల గడ్డివాము దగ్ధమయ్యింది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం మధ్యాహ్నం రెంగాలగుడ గ్రామంలో గోపీనాథ్ గౌఢ తన మూడు ఎకరాల పొలంలో వరి ధాన్యం నూర్పు అనంతరం గడ్డిని కళ్లంలో కుప్పగా వేశాడు. అయితే మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో అకస్మాత్తుగా గడ్డి వాములకు నిప్పు అంటుకోవడంతో మంటలు ఎగసిపడ్డాయి. వెంటనే గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అనంతరం బొయిపరిగుడ అగ్నిమాపక విభాగానికి సమాచారం అందజేశారు. వెంటనే అగ్నిమాపక విభాగ అధికారి ఉమేష్ చంద్రబాగ్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో తనకు రూ.25 వేల నష్టం వాటిల్లినట్లు గోపీనాథ్ గౌడ వాపోయాడు. తమకు న్యాయం చేయాలని కోరాడు.

వివాహిత అనుమానాస్పద మృతి



ఇంట్లో దర్యాప్తు నిర్వహిస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ దండాసి వీధిలో నివసిస్తున్న జననీ రయితా (23) అనే వివాహిత అనుమానస్పదంగా మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గజపతి జిల్లా మోహనకు చెందిన జననీకి నాలుగేళ్ల క్రితం గుణుపూర్ సమితిలోని కులుసింగి పంచాయతీ తిరిలిడ గ్రామానికి చెందిన సుదీర్ రయితా (29) అనే యువకుడితో వివాహం జరిగింది. వారు గుణుపూర్‌లోని దాండాసి వీధిలో ఒక అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. ఇంటిలో మంగవారం జననీ అపస్మారక స్థితిలో పడి ఉండడం గమనించిన వీధిలోని కొందరు వెంటనే గుణుపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే తమ కూమార్తె అనారోగ్యంతో చనిపోలేదని, ఎవరో హత్య చేసి ఉంటారని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌లో పెట్టిన నగదు చోరీ



బాధితుడు సాబొరొ

రాయగడ: బైకు డిక్కీలో పెట్టిన నగదు చోరీకి గురైన ఘటన జిల్లాలోని గుడారి సమితి ఖెతాగుడ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన దేవేంద్ర సాబొరొ అనే వ్యక్తి తన బ్యాంకు ఖాతాలోని రూ.60 వేలు డ్రా చేసి, తన బైకు డిక్కీలో ఉంచి, పక్కనే ఉన్న కిరాణా దుకాణానికి వెళ్లాడు. అనంతరం తిరిగి వచ్చే సమయానికి బైకు డిక్కీ తెరిచి ఉండడం గమనించాడు. వెంటనే వెతికి చూడగా డిక్కీలో నగదు కనిపించలేదు. దీంతో గుడారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు దొంగలు అరెస్టు



అరెస్టు చేసిన దొంగలను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గత కొద్ది రోజులుగా బరంపురం పోలీసు జిల్లా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను పెద్ద బజారు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ మాట్లాడుతూ.. బరంపురం పరిసర ప్రాంతాల్లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారి వద్ద నుంచి రూ.25 లక్షల బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. అరెస్టైన వారిలో అశోక్‌నగర్‌కి చెందిన ఎస్.సంతోష్, టి.బజన్ అలాగే 17 ఏళ్ల బాలుడు ఉన్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాలను బాధితులకు అప్పగించారు.

జయహో.. జనయిత్రి



- రాజకీయాల్లో సత్తాచాటుతున్న మహిళామణులు
- దేశ అత్యున్నత పీఠంపై ద్రౌపది ముర్ము
- మంత్రులుగా రాణిస్తున్న పలువురు

భువనేశ్వర్: రాష్ట్రంలోని మహిళలు అన్ని రంగాల్లోనూ ప్రస్తుతం దూసుకెళ్తున్నారు. ఆకాశంలో సగం.. అవకాశాల్లో సగం.. అన్నింటా సగం అంటూ రాణిస్తున్నారు. ముఖ్యంగా రాజకీయ రంగంలోనూ ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ.. పెను సవాళ్లను ఎదుర్కొంటూ అత్యుత్తమ నిర్ణయాలు తీసుకునే శక్తిగా ఎదుగుతున్నారు. దేశంలోనే అత్యున్నత రాష్ట్రపతి పీఠాన్ని రాష్ట్రానికే చెందిన మహిళ ద్రౌపది ముర్ము అధిష్టించి రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారు. రాష్ట్రానికి సంబంధించి లోక్‌సభలో 21 సీట్లు ఉండగా వారిలో 7 మంది మహిళలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అలాగే రాజ్యసభలో 10 మందిలో ఒక మహిళ ఉన్నారు. అదేవిధంగా రాష్ట్ర శాసనసభలో 17 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉండగా, వారిలో మూడోవంతు మహిళలు అనగా ఐదుగురు మంత్రి పదవిలో కొనసాగుతుడడం విశేషం.

శాసనసభలో శభాష్ అనిపిస్తూ..

రాష్ట్ర శాసనసభకు 17 మంది మహిళా సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో స్నేహాంగిని చురియా – అట్టాబిరా, ప్రమీల మల్లిక్ – బింఝార్‌పూర్, సీమారాణి నాయక్ – హిండోల్, సూర్యమణి బైద్య – ఖల్లికోట్ షెడ్యూల్డు కులం నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కుసుమ్ టెట్టే – సుందరగడ్, బసంతి హేంబ్రమ్ – కరంజియా, పద్మిని దియాన్–కోట్పాడ్ షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బొర్షాసింగ్ బొరిహా – పదమ్‌పూర్, రీతా సాహు – బిజేపూర్, అలకా మహంతి – బ్రజ్‌రాజ్ నగర్, మీనాక్షి మహంత – చంపువా, సునంద దాస్ – బొరి, టుకుని సాహు – టిట్లాగడ్, సాబిత్రి అగర్వాలా – పటకురా, లతికా ప్రధాన్ – కవిసూర్య నగర్, మంజుల స్వంయి – అసికా, ఉషాదేవి – చికిటి నియోజక వర్గాలకు సాధారణ వర్గాల మహిళలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

మంత్రులు

ప్రమీల మల్లిక్



1963 మార్చి 4వ తేదీన జన్మించి బీఏలో ఉత్తీర్ణత సాధించారు. జాజ్‌పూర్ జిల్లా బింఝార్‌పూర్ (షెడ్యూల్డు కులం) నియోజకవర్గం నుంచి 6 సార్లు ఎన్నికై శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1990 సంవత్సరంలో తొలిసారిగా జనతా దళ్ అభ్యర్థిగా 10వ శాసనసభకు ఎన్నికయ్యారు. బిజూ జనతా దళ్ ఆవిర్భావం నుంచి 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు బీజేడీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. 2004 మే నెల నుంచి 2011 సంవత్సరం ఫిబ్రవరి వరకు రాష్ట్ర మహిళ, శిశు అభివృద్ధి మంత్రిగా కొనసాగారు. 2019 మే నెల నుంచి 2022 జూన్ 4వ తేదీ వరకు ప్రభుత్వ చీఫ్ విప్‌గా విజయవంతంగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ విభాగం మంత్రిగా కొనసాగుతున్నారు.

ఉషాదేవి



1952 ఫిబ్రవరి 25వ తేదీన జన్మించి ఆర్ట్స్ విభాగంలో పట్టా పుచ్చుకున్నారు. 1990 సంవత్సరంలో గంజాం జిల్లా చికిటి నియోజకవర్గం నుంచి రాష్ట్ర శాసనసభకు తొలిసారి జనతా దళ్ అభ్యర్థిగా ఎన్నికై య్యారు. తదుపరి 2000 సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఈ నియోజకవర్గం బీజేడీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. 2011 నుంచి పలు శాఖల మంత్రిగా బాధ్యతలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. జౌళి, చేనేత, హస్త కళలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రణాళిక, సమన్వయం, మహిళ, శిశు అభివృద్ధి, నైపుణ్యత, సాంకేతిక విద్య శాఖల మంత్రిగా లోగడ బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం గృహ నిర్మాణం, నగర అభివృద్ధిశాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

టుకుని సాహు



బొలంగీరు జిల్లా టిట్లాగడ్ నియోజకవర్గం నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014 సంవత్సరం నుంచి ఇప్పటివరకు నిరవధికంగా ఈ నియోజకవర్గం సభ్యురాలిగా కొనసాగడం విశేషం. 1976 మార్చి 13వ తేదీన జన్మించి బీఏలో ఉత్తీర్ణత సాధించారు. లోగడ మహిళ, శిశు అభివృద్ధి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి, ప్రస్తుతం జల వనరులు, వాణిజ్యం, రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రీతా సాహు



1971 జూన్ 16వ తేదీన జన్మించి మెట్రిక్యులేషన్ విద్యార్హతతో ప్రత్యక్ష రాజకీయాల్లో రాణిస్తున్నారు. 2019లో తొలిసారిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగిడారు. ఆ సంవత్సరం జరిగిన ఉప ఎన్నికలో విజేతగా నిలవడంతో 2022 జూన్ 5వ తేదీన నవీన్ కొలువులో జౌళి, చేనేత, హస్త కళల శాఖ మంత్రి పదవి వరించింది. ప్రస్తుతం ఈ హోదాలో కొనసాగుతున్నారు.

బసంతి హేంబ్రమ్



మయూర్‌భంజ్ జిల్లా కరంజియా దళిత నియోజక వర్గం ఎమ్మెల్యేగా ఎన్నికై మంత్రిగా కొనసాగుతున్నారు. డిగ్రీ విద్యార్హతలతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించి రాష్ట్ర మహిళ, శిశు అభివృద్ధి, మిషన్ శక్తి మంత్రిగా కొనసాగుతున్నారు. ఆమె 1981 జనవరి 8వ తేదీన జన్మించారు.

తొలిసారి ప్రాతినిధ్యం

రాష్ట్ర శాసనసభకు అలకా మహంతి, బొర్షా సింగ్ బొరిహా, కుసుమ్ టెట్టే, లతికా ప్రధాన్, మంజుల స్వంయి, మీనాక్షి మహంత, పద్మిని దియాన్, సాబిత్రి అగర్వాలా, సునంద దాస్, సూర్య మణి బైద్య తొలిసారి ఎన్నికయ్యారు. అలకా మహంతి, బొర్షాసింగ్ బొరిహా ఉప ఎన్నికలో పోటీ చేసి గెలుపొందగా, ఇతరలు సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసి గెలిపొందారు.

ఇతర ఎమ్మెల్యేలు...

పేరు	జననం	విద్యార్హత
కుసుమ్ టెట్టే	17 జులై 1973	బీఏ
లతికా ప్రధాన్	25 ఏప్రిల్ 1975	బీఎస్సీ, ఎల్ఎల్ఎం
మంజుల స్వంయి	15 మార్చి 1955	ప్రాథమిక విద్య
మీనాక్షి మహంత	26 నవంబర్ 1983	బీఎస్సీ
పద్మిని దియాన్	1 జులై 1986	మెట్రిక్యులేషన్
సునంద దాస్	2 ఫిబ్రవరి 1974	మెట్రిక్యులేషన్
సూర్యమణి బైద్య	22 జూన్ 1988	మెట్రిక్యులేషన్
అలకా మహంతి	5 మే 1967	బాడ్మింటన్ క్రీడాకారిణి
సాబిత్రి అగర్వాలా	--	ప్రాథమిక విద్య
బొర్షాసింగ్ బొరిహా	--	--
స్నేహాంగిని చురియా	9 డిసెంబర్ 1968	ఎంఏ, బీఈడీ
సీమారాణి నాయక్	8 జులై 1964	మెట్రిక్యులేషన్, సీటీ



కుసుమ్ టెట్టే, లతికా ప్రధాన్, మంజుల స్వంయి, మీనాక్షి మహంత, పద్మిని దియాన్, సునంద దాస్, సూర్యమణి బైద్య, అలకా మహంతి, సాబిత్రి అగర్వాలా, బొర్షాసింగ్ బొరిహా, స్నేహాంగిని చురియా, సీమారాణి నాయక్

పార్లమెంటులో...

లోక్‌సభలో రాష్ట్ర బలం 21 స్థానాలు. మూడింట ఒక వంతు సగటున 33 శాతం మహిళలు లోక్‌సభకు రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడం విశేషం. రాష్ట్రం నుంచి 7 మంది మహిళలు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఇద్దరు భారతీయ జనతా పార్టీ సభ్యులు కాగా, మిగిలిన వారంతా బిజూ జనతా దళ్ సభ్యులు కావడం విశేషం.

పేరు	జననం	విద్యార్హత	ప్రత్యేకత
ప్రమీల బిసొయి – అసికా	15 సెప్టెంబర్ 1948	ప్రాథమిక విద్య	తొలిసారి పోటీచేసి ఎన్నికవ్వడం
మంజులత మండల్ –భద్రక్	26 జూన్ 1976	బీఏ	
అపరాజిత షడంగి – భువనేశ్వర్	8 అక్టోబర్ 1969	బీఏ (ఇంగ్లిష్)	ఐఏఎస్ అధికారి. సబ్ కలెక్టర్, కలెక్టర్, భువనేశ్వర్ నగర పాలక సంస్థ కమిషనర్, రాష్ట్ర పాఠశాలలు – సామూహిక విద్యా విభాగం, పంచాయతీ రాజ్, జౌళి శాఖ కార్యదర్శి, కేంద్ర గ్రామీణ అభివృద్ధి విభాగం సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు.
సంగీత కుమారి సింఘ్‌దేవ్ – బొలంగీరు	3 డిసెంబర్ 1961	విద్యార్హత: బీఏ, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ డిప్లొమా	ప్రస్తుతం ఆమె నాలుగో సారి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బొలంగీరు సింఘ్‌దేవ్ రాజ వంశీకురాలు.
డాక్టరు రాజశ్రీ మల్లిక్ – జగత్‌సింఘ్‌పూర్	3 నవంబరు 1964	విద్యార్హత: ఎంబీబీఎస్, ఎండీ (పాథాలజి),	
సర్మిష్ట కుమారి సెఠి – జాజ్‌పూర్	4 ఫిబ్రవరి 1974	ఎంఏ, ఎంఫిల్ (రాజకీయ శాస్త్రం)	సివిల్ సర్వీసు అభ్యర్థి. 2000 సంవత్సరం నుంచి కొనసాగిన లోక్‌సభకు ఎన్నిక అయ్యేంతవరకు సహాయ కన్సోలిడేషను అధికారి, డిప్యూటీ కలెక్టర్, అండర్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరిగా ఉన్నత హోదాల్లో ప్రభుత్వ ఉద్యోగిగా కొనసాగారు.
చంద్రాని ముర్ము - కెంజొహర్	16 జూన్ 1993	బీటెక్ (మెకానికల్ ఇంజినీరింగ్)	



ప్రమీల బిసొయి - అసికా, మంజులత మండల్ - భద్రక్, అపరాజిత షడంగి - భువనేశ్వర్, చంద్రాని ముర్ము - కెంజొహర్, సంగీత కుమారి సింఘ్‌దేవ్ - బొలంగీరు, డాక్టరు రాజశ్రీ మల్లిక్ - జగత్‌సింఘ్‌పూర్, సర్మిష్ట కుమారి సెఠి - జాజ్‌పూర్

రాజ్యసభలో...

సులత దేవ్



రాజ్యసభలో రాష్ట్రం నుంచి 10 మంది సభ్యులు కొనసాగుతున్నారు. వీరిలో ఒకరు మహిళ కావడం విశేషం. సులత దేవ్ బిజూ జనతా దళ్ అభ్యర్థిగా రాజ్యసభలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 1972 సంవత్సరం జులై 13వ తేదీన జన్మించారు. కొనసాగుతున్న రాజ్యసభకు తొలిసారిగా ఎన్నికయ్యారు.

మహిళల అభివృద్ధే దేశాభివృద్ధి



రాయగడ: మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

రాయగడ: మహిళల అభివృద్ధే దేశాభివృద్ధి అని పలువులు వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని రామనగుడ సమితి పరొక్షితి గ్రామంలో సినీ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పండ మాట్లాడుతూ మహిళలకు వారి హక్కులపై అవగాహన అవసరం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలు, పథకాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మంపరొక్షితి ఉప స్వాస్థ్య కేంద్రం సిహెచ్‌వో స్వాతి త్రిపాఠి, అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీ కొలక తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్యాలస్ వద్ద యూటెక్ కంప్యూటర్స్ అకాడమీలో ప్రగతి మహిళా సంఘటన్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు పలు రకాల పోటీలను నిర్వహించారు. నారీ స్వసస్తీకరణ, సమాజంలో మహిళల పాత్ర అనే అంశంపై వక్తృత్వ పోటీ, చదువులో నారీ–దేశానికే సిరి అనే అంశంపై వ్యాస రచన పోటీలు, పిండి వంటల పోటీలను నిర్వహించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా నృసింహా పట్నాయక్, స్వేతా పట్నాయిక్, సీతారాం ప్రధాన్‌లు వ్యవహరించగా, వ్యాస రచన పోటీలకు శోభూషన్ పటాన్యక్, సొదాగర్, అంజనా పట్నాయక్, సబితా పండిట్‌లు ఉన్నారు. ప్రగతి మహిళా సంఘటన్ కార్యదర్శి తనూజా శథపతి, సలహాదారు బిచిత్రానంద బెబర్తాల ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి.

గుణుపూర్‌లో రైల్వే డీఆర్‌ఎం పర్యటన



డీఆర్‌ఎం అనుప్‌కుమార్‌తో గుణుపూర్ వాసులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో విశాఖపట్నం రైల్వే డివిజనల్ మేనేజరు (డీఆర్‌ఎం) అనుప్ కుమార్ సతపతి సోమవారం రాత్రి పర్యటించారు. రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆంధ్ర–ఒడిశా రైలు ప్రయాణికుల సంఘానికి చెందిన ప్రతినిధులు ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. గుణుపూర్ –నౌపడా రైల్వే మార్గంలో మరో డబుల్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా అభివృద్ధి చెందుతున్న గుణుపూర్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం రెండో ప్లాట్‌ఫారం నిర్మించాలని విన్నవించారు. కాశీనగర్, తెపుర, గంగవాడ రైల్వేస్టేషన్‌ల మధ్య ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైల్వే క్రాసింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గుణుపూర్ నుంచి సిలిమాల్ వరకు రాకపోకల కోసం మరో రైలు సౌకర్యం కల్పించాలని వివరించారు. వినతిపత్రం అందజేసినవారిలో గుణుపూర్‌లోని జీఐఈటీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ పండ, సమాజ సేవకుడు అక్షయ దాస్, పాత్రికేయులు మిలీ పాఢి, ఉమాశంకర్ దాస్, సురేంద్ర మల్లిక్, రాజేష్ పాఢి తదితరులు ఉన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

- మంత్రి జగన్నాథ సరక

రాయగడ: విద్యార్థులు సేవా దృక్పథం అలవర్చుకోవాలని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక అన్నారు. జిల్లాలోని చంద్రపూర్ సమితి డంగసారొడ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం హెచ్‌ఎం విజయకుమార్ నాయక్ వార్షిక నివేదిక చదివి వినిపించారు.



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సరక తదితరులు

క్లుప్తంగా

పద్మశ్రీ ప్రఫుల్ల కుమార్ జెనా మృతి


డాక్టర్ ప్రఫుల్ల కుమార్ జెనా (ఫైల్)

భువనేశ్వర్: ప్రముఖ శాస్త్రవేత్త పద్మశ్రీ ప్రొఫెసర్ ప్రఫుల్ల కుమార్ జెనా (91) లూయిస్ రోడ్ ప్రాంతంలోని తన నివాసంలో మంగళవారం తుదిశ్వాస విడిచారు. ఆయన భౌతిక కాయానికి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. మృతిపై గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్, సీఎం నవీన్ పట్నాయక్ సంతాపం ప్రకటించారు. లోహ శాస్త్రంలో శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించి, స్ఫూర్తిని ప్రేరేపించిన మేధావి డాక్టర్ జెనా అని సీఎం తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆయన మృతి రాష్ట్రానికి తీరని లోటన్నారు. 1977లో భారత ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీతో సత్కరించింది.

'కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలి'


సమావేశాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: పట్టణంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని పలువురు కవులు డిమాండ్ చేశారు. స్థానిక యాదవ భవన్‌లో జన కల్యాణ మంచ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కవితల ద్వారా కేంద్రీయ విద్యాలయం అవసరాన్ని వివరించారు. న్యాయవాది శివప్రసాద్ పాఢీ, ఉపాధ్యాయుడు తపన కుమార్ మిశ్ర జయపురంలో కేంద్ర విద్యాలయ స్థాపన ఆవశ్యకతపై తెలియజేశారు. కేంద్ర విద్యాలయం కోసం జిల్లా అధికారులు స్థలం కేటాయించడంతో పాటు తాత్కాలిక భవనాలు ఏర్పాటు చేశారని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారం అందిస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో యాదవ సమాజ్ కార్యదర్శి రాజేంద్ర గౌడ, బీజేడీ నేత బాలారాయ్, జానకీ పాణిగ్రాహి, న్యాయవాది ప్రఫుల్ల కుమార్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

విక్రంపురంలో డోలోత్సవం


పూజలందుకుంటున్న రాధాకాంతలు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సమితి విక్రంపురంలో ఉన్న రాధాకాంత మందిరంలో మంగళవారం నుంచి డోలోత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం రాధా, కాంత ఉత్సవ విగ్రహాలను డోలీలో మోసుకుంటూ పురవీధుల్లో ఊరేగించారు. బుధవారంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలియజేశారు.

పేలుడు ఘటనలో ఆరుగురు అరెస్ట్

భువనేశ్వర్: ఖుర్దా జిల్లా భుషండ్ పూర్ బాణాసంచా పేలుడు ఘటనలో 6గురు నిందితులను అరెస్టు చేశారు. విచారణలో పోలీసులు 62 కిలోల పేలుడు పదార్థాలు జప్తు చేశారు. వివిధ ప్రాంతాల్లో పోలీసుల సోదాలు ముమ్మరం చేశారు. ఈ విషాద ఘటనలో మృతుల సంఖ్య 5కి పెరిగింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరి పరిస్థితి ఆందోళనగా ఉందని పోలీసులు తెలియజేశారు.

పుష్పాలంకరణలో పైడితల్లి


ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువ జామునుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గడ్డివాములు, ధాన్యం దగ్ధం

బాడంగి: మండలకేంద్రం బాడంగిలోని మరడానవారి కళ్లంలో మంగళవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 8గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. వాటిలోని మూడు గడ్డివాములలో గల సుమారు 50 బస్తాల (250 క్వింటాళ్ల) ధాన్యం కాలిబూడిదయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలోని వీరబ్రహ్మంగారి గుడిపక్కనగల మరడాన చంద్రినాయుడు పంటకళ్లంలో ఈ అగ్నిప్రమాదం జరిగింది. అమ్మవారి పండుగ కావడంతో తారాజువ్వలు లేదా ఎవరైన బీడీ, సిగరెట్లు వెలిగించి అగ్గిపుల్ల ఆర్పకుండా పడేసిన కారణంగా గడ్డివాములు తగలబడిపోయాయి, సమాచారం మేరకు డొంకినవలస, రాజాంల నుంచి అగ్నిమాపకదళాలు వచ్చి మంటలను ఆర్పేందుకు కృషిచేశాయి. దీంతో సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

వైభవం.. డోలోత్సవం


స్వర్ణాలంకారంలో బలభద్ర స్వామి


బంగారు శోభతో సుభద్ర దేవి


రాజ రాజేషుని అలంకరణలో జగన్నాథుడు


డోలో యాత్రలో మెండా పొడి (హోలికా దహనం) కార్యక్రమం

- బంగారు శోభలో జగన్నాథుడు
- భగవంతునితో భక్తుల హోలీ సంబరం

భువనేశ్వర్: డోలో పూర్ణిమ హోలీ పురస్కరించుకొని శ్రీమందిరం రత్న వేదికపై జగన్నాథుడు బంగారు మెరుపులతో మంగళవారం శోభిల్లాడు. డోలికలో డోలో గోవిందుడు, నావలో మధుసూదనుడు, రథంలో వామన స్వరూప శ్రీజగన్నాథుని దర్శనం మహాద్భాగ్యంగా భక్తులు భావిస్తారు. ఫాల్గుణ శుక్ల దశమి నుంచి చైత్ర శుక్ల ప్రతిపాద వరకు శ్రీజగన్నాథ దేవస్థానంలో వారం రోజుల పాటు డోలోత్సవం అత్యంత ఆనందోల్లాసాలతో నిర్వహిస్తారు. ఫాల్గుణ పూర్ణిమ నాడు నిర్వహించిన హోలీ ఉత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ ఉత్సవంలో భక్తులతో శ్రీజగన్నాథుడు ప్రత్యక్షంగా రంగులాట ఆడి మురిపిస్తాడని ముచ్చట పడడం విభిన్నత. మరోవైపు శ్రీమందిరం రత్న వేదికపై మూల విరాటులకు మంగళవారం స్వర్ణ అలంకరణ చేశారు. అరుదైన ఈ అలంకరణ రాజ రాజేశ్వర్ లేదా సునాబేష్ (స్వర్ణ అలంకరణ)గా ప్రతీతి. గర్భాలయంలో స్వామివారి నిత్య సేవాదులతో స్వర్ణ అలంకరణ పూర్తి కావడంతో స్వామి అనుమతి సంకేతంగా ఆజ్ఞామాల పొందిన భూదేవి - శ్రీదేవి సమేతంగా గోవిందుని ఉత్సవమూర్తులను విమానం (పల్లకి)లో 22 మెట్లు గుండా సింహ ద్వారం వెలుపల ఉన్న డోలిక మండపం ప్రాంగణానికి తరలించారు. అంతకు ముందు శ్రీమందిరం చుట్టూ ఏడుసార్లు ప్రాకార ప్రదక్షిణ నిర్వహించడం విశేషం. డోలో మండపానికి ఏడు ప్రదక్షిణలు చేసిన తర్వాత విమానం వేదికకు చేరింది. ఈ వేదికపై డోలోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రాంగణంలో గజపతి రాజా ప్రతినిధి ముదిరొస్తొ సేవకులు ప్రత్యేక పూజార్చనలు, హోమాదులు, నిర్వహించారు.

శ్రీజగన్నాథుని మెండాపొడి ఉత్సవం

మార్వాడీ వర్గానికి చెందిన మహిళలు మెండాపొడి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. హోలికా రాక్షసి దహనానికి ప్రతీకగా చిన్న పిడకల్ని మాలలుగా పోగుచేసి దహనకాండ శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీమందిరంలో డొలో పూర్ణిమ ముందు రోజు సోమవారం సాయంత్రం చీకటి పడిన తర్వాత జగన్నాథునికి మెండాపొడి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రాష్ట్ర ప్రజలకు సీఎం శుభాకాంక్షలు

పవిత్ర డోలో పూర్ణిమ, హోలీ పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుడు గోవిందుని ఆశీస్సులతో అందరి జీవితాలు సుఖ సంతోషాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు.


డోలో యాత్రకు వేంచేస్తున్న డోలో గోవిందుడు


డోలో గోవిందుని హోలీ సందడి


యాత్రలో శ్రీదేవి, భూదేవి సమేత డోలో గోవిందుని రంగుల కేళి

అభివృద్ధికి బాటలు


జయపురం రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం శతపతి తదితరులు

- అమృత భారత స్టేషన్ యోజనలో జయపురం రైల్వే స్టేషన్
- శరవేగంగా జరగనున్న పనులు

జయపురం: జయపురం రైల్వేస్టేషన్ అభివృద్ధికి బాటలు పడ్డాయి. రైల్వేస్టేషన్‌ను అమృత భారత్ స్టేషన్ యోజనలో చేర్చినట్లు విశాఖపట్నం రైల్వే డివిజన్ డీఆర్ఎం అరుణ శతపతి వెల్లడించారు. కొరాపుట్ జిల్లా పర్యటనలో భాగంగా జయపురం రైల్వేస్టేషన్‌ను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జయపురం స్టేషన్‌ను ఉత్తమ స్టేషన్‌గా తీర్చి దిద్దేందుకు చర్యలు చేపడతామని తెలియజేశారు. విశాఖపట్నం డివిజన్‌లోని 16 స్టేషన్లను ఈ పథకంలో చేర్చడం జరిగిందని వెల్లడించారు. ఇప్పటివరకు ప్రాంతీయ స్టేషన్‌గా ఉన్న జయపురం రైల్వే చిత్రపటంలో ప్రముఖ స్థానం పొందనుందని వెల్లడించారు. అమృత భారత స్టేషన్ పథకంతో పాటు ఇతర నిధులతో స్టేషన్ అభివృద్ధి, కొత్త స్టేషన్ నిర్మించడం జరుగుతుందని వివరించారు. ఫ్లాట్ ఫారంతో పాటు లిఫ్ట్, ర్యాంప్‌లను ఏర్పాటు చేసేందుకు వ్యయపు అంచనా రూపొందిస్తామన్నారు. అనంతరం టెండర్ పనులు పూర్తి చేస్తామని తెలియజేశారు. కొత్తవలస నుంచి కొరాపుట్ వరకు అనేక గుహలు, సొరంగాలు, వంతెనలు, వంకటింకర రోడ్లు ఉండడం వలన పనులు కొంత ఆలస్యం అవుతున్నాయన్నారు. జయపురం నుంచి మల్కన్‌గిరి, జయపురం నుంచి నవరంగపూర్ రైలు మార్గాల కోసం భూసేకరణ పూర్తి చేసే విషయంలో తాము ఒడిశా రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో చర్చలు జరుపుతామన్నారు. ఈ పనులు పూర్తి చేసేందుకు రైల్వే మంత్రి సైతం ఆసక్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రయాణికుల డిమాండ్ ఆధారంగా రైళ్లలో కోచ్‌ల సంఖ్య పెంచడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు విశాఖపట్నం ఏడీఆర్ఎం సునీల్ కుమార్ గుప్త, టి.ఎస్.రావు, పీకే మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్ వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటరమణ

బలిజిపేట: పదవ తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వరాదని డీఈఓ ఎస్‌డీవీ రమణ హితవు పలికారు. ఈ మేరకు బలిజిపేట ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ ఫంక్షన్‌కు ఆయన మంగళవారం హాజరయ్యారు. విద్యార్థులు మాస్‌కాపీయింగ్‌కు పాల్పడకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని స్పష్టం చేశారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థులు బాగా చదివి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిరోహించాలని పిలుపునిచ్చారు. పరీక్షల్లో అన్ని ప్రశ్నలకు జవాబులు రాయాలని సూచించారు. ఒకటే పరీక్ష పేపరు ఉండడం వల్ల ఎంతో ఉపయోగముందన్నారు. ఉపాధ్యాయుడు ఉత్తమమైన బోధన చేస్తే విద్యార్థులు వారిని ఎల్లప్పుడూ గుర్తుంచుకుని గుండెల్లో పెట్టుకుంటారన్నారు. పరీక్షల ముందు ఆరోగ్యంగా ఉండి మంచి విద్యను అభ్యసించి మంచి మార్కులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు మార్గదర్శకం

పదో తరగతి పరీక్షలు విద్యార్థి దశలో భవిష్యత్తుకు మార్గదర్శకమని పరీక్షల కో ఆర్డినేటర్ రామకృష్ణ అన్నారు. జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరియల్ బృందం ఆధ్వర్యంలో మండలంలోని వంతరాం, చిలకలపల్లి ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు ఆయన మంగళవారం సూచనలు అందజేశారు. అందులో భాగంగా వంతరాం కేజీబీవీలో ఆయన మాట్లాడుతూ పదవతరగతి పరీక్షలు రాసేటప్పుడు విద్యార్థులు కొన్ని సూచనలు పాటించాలని చెప్పారు. చదివిన ప్రశ్నలు పరీక్షలో వచ్చినప్పుడు ముందుగా వాటిని తప్పులు లేకుండా, మంచి దస్తూరీతో రాయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఓ రాజారావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోగి మృతిపై విచారణ


విచారణ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కొద్ది రోజుల క్రితం ఎస్.కోటకు చెందిన ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటనలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్వీ రమణకుమారి విచారణ చేపట్టారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే వృద్ధురాలు మరణించిందని ఆమె బంధువులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేసిన నేపథ్యంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మంగళవారం మృతురాలి బంధువులు, రోగి మరణించిన రోజు డ్యూటీలో ఉన్న వైద్య సిబ్బందిని విచారణ చేశారు. ఏవ్యాధితో ఆమె ఆస్పత్రిలో ఉంది, ఏవిధమైన చికిత్స అందించారు, ఆస్పత్రిలో చేర్పించినప్పుడు పరిస్థితి తదితర అంశాలపై ప్రశ్నించారు.

భార్య, పిల్లల మృతి కేసులో భర్తకు జైలుశిక్ష

గంట్యాడ: వరకట్న వేధింపులకు పాల్పడి భార్య, ఇద్దరు పిల్లల మరణానికి కారకుడైన నిందితుడికి 4 ఏళ్ల జైలు, రూ.15 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ విషయాన్ని గంట్యాడ ఎస్సై కె.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని రామవరం గ్రామానికి చెందిన కేవీవీ నరసింహరాజు వరకట్నం కోసం భార్యను వేధించడంతో పిల్లలతో సహా ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసు విచారణ సందర్భంగా అప్పటి గంట్యాడ ఎస్సై, ప్రస్తుత రూరల్ సీఐ తిరుపతి రావు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుతం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో సాక్షులను విచారించిన తరువాత నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జె. శ్రీనివాస్‌రావు ముద్దాయికి శిక్ష ఖరారు చేశారు. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ పట్నాయక్ పోలీస్ తరపున కోర్టులో వాదనలు వినిపించారు.

12న అండర్-19 జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

విజయనగరం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12న అండర్ -19 జిల్లా క్రికెట్ జట్టు (బాలురు) ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరంలోని సర్ విజ్జి స్టేడియంలో ఆ రోజున ఉదయం 7 గంటలకు ఎంపిక పోటీలను నిర్వహిస్తామన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే అభ్యర్థులు 2004 సెప్టెంబర్ 1 తరువాత జన్మించిన వారై ఉండాలని, ఆటగాళ్లు వైట్ డ్రెస్, సొంత క్రికెట్ కిట్‌తో హాజరు కావాలని సూచించారు. అలాగే విజయనగరం జిల్లాలో జన్మించిన జన్మ ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డుతో రావాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: సీతానగరం మండలం చినభోగిలి గ్రామానికి చెందిన కోరాడ మణి మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పార్వతీపురం అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయవాడలో ఉంటున్న కోరాడ మణి, కుటుంబసభ్యులు అగ్ని గంగమ్మ జాతరకు గ్రామానికి వచ్చారు. తలనొప్పి ఉందని మణి మంగళవారం మాత్రలు వేశాడు. అయితే మాత్రలు అధిక మోతాదులో వేయడం గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

బంకేశ్వరి ఉత్సవాలు ప్రారంభం


ఆలయ ప్రాంగణంలో భోజనాలు చేస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో బంకేశ్వరి అమ్మవారు

బరంపురం: దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్య దైవం బంకేశ్వరి అమ్మవారి ఉత్సవాలు సోమవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. దీంతో మంగళవారం పరిసర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారికి తలనీలాలు, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి మధ్యాహ్నం రాజ భోగం, సాయంత్రం సంధ్యా హారతి, రాత్రి బెడా చేపట్టి ఉత్సవ దేవతలను ఊరేగించారు. గంజాం ఎస్పీ బ్రజేష్ కుమార్ రాయ్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

గంగమ్మ జాతర ప్రారంభం


ప్రారంభమైన గంగమ్మ జాతర


పూజలందుకుంటున్న గంగమ్మ తల్లి

జయపురం: స్థానిక డెప్పిగుడలో అగ్ని గంగమ్మ దేవి ఘట జాతర సోమవారం వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి ఎమ్మెల్యే పూజలు నిర్వహించి ఘటాలను పూజారి తలపై ఉంచారు. అక్కడ నుంచి వాయిద్యాలతో అమ్మవారి గుడికి తీసుకెళ్లారు. మొత్తం వారం రోజులు పాటు జాతర జరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ ఎం.నాగేశ్వరరావు

బొబ్బిలి రూరల్: మండలంలోని గొర్లెసీతారాంపురం అప్పయ్యచెరువులో మంగళవారం గుర్తుతెలియని మహిళ (45) మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సమాచారం మేరకు సీఐ ఎం.నాగేశ్వరరావు సిబ్బందితో వెళ్లి, మృతదేహాన్ని పరిశీలించి వెలికితీయించారు. మృతురాలి శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేశారు. కాగా మృతురాలిని బాడంగి మండలం పెద్దపల్లికి చెందిన మహిళగా కొందరు భావిస్తున్నారు. స్థానికంగా ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు అంతా సిద్ధంగా ఉండాలని ఎన్నికల పరిశీలకులు జె.శ్యామలరావు ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌లతో కలిసి ఎలక్షన్ నోడల్ ఆఫీసర్లతో స్థానిక సంస్థల ఎన్నికలపై ఆయన మంగళవారం సమీక్షించారు. పోలింగ్ కేంద్రాల వారీగా అంతా సిద్ధం చేసుకోవాలన్నారు. సూక్ష్మ పరిశీలకులు తప్పని సరిగా పోలింగ్ పార్టీతో కలసి వెళ్లాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో 4 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వెబ్ కాస్టింగ్, తదితరమైనవి అంతా సిద్ధం చేసినట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద బందోబస్తు, శాంతి భద్రతల గురించి పరిశీలకులు అడగ్గా ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ ఎన్నికల్లో శాంతి భద్రతలు, పోలీసు బందోబస్తు, చెక్ పోస్టులు, తదితర వాటిపై వివరించారు.

నాలుగు స్వల్పకాలిక కోర్సుల్లో ప్రవేశాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో త్వరలో ప్రారంభించనున్న నాలుగు స్వల్పకాలిక శిక్షణల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేవీఎస్ శ్రీనివాసరావు చెప్పారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం వివరాలు వెల్లడించారు. మూడు నుంచి నాలుగు నెలల కోర్సులు ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, డాస్ సెటాప్ బాక్స్ ఇన్‌స్టాలేషన్ సర్వీస్ టెక్నీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 15లోపు దరఖాస్తులు చేసుకోవాలని, 30 మంది బ్యాచ్ కుదిరిన తక్షణం కోర్సు శిక్షణ ప్రారంభం కానుందని అన్నారు. విద్యార్థులు 10వ తరగతి ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డులతో సంప్రదించాలని, పేర్ల నమోదుకు, ప్రవేశాలకు ఐటీఐని సంప్రదించాలని, వివరాల కోసం ఫోన్ నంబర్లు 9441930405, 7989177887లను సంప్రదించాలని చెప్పారు.

9, 10వ తేదీల్లో ఆదిత్యుని కిరణ స్పర్శ దర్శనం

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో అద్భుత క్షణాలకు సమయం ఆసన్నమైంది. ఉత్తరాయణం నుంచి దక్షిణాయణానికి కాల మార్పుల్లో భాగంగా ఈ నెల 9,10వ తేదీల్లో తొలి లేలేత కిరణాలు స్వామి పాదాలను, ఆపై ఇతర భాగాలను నేరుగా తాకే అద్భుత దృశ్యం కనిపించనుంది. వేకువ జామున సూర్యోదయ సమయంలో కేవలం ఐదారు నిమిషాల పాటు మాత్రమే ఈ దృశ్యం కనువిందు చేయనున్న క్రమంలో భక్తులు దర్శించుకునేందుకు ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలు సన్నద్ధమవుతున్నారు.

టెన్త్ పరీక్షలకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పదో తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్నాయని, ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. పరీక్షల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో 30 మండలాల్లోని 149 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 28,855 మంది రెగ్యులర్ అభ్యర్థులు, 720 ప్రైవేటు అభ్యర్థులు మొత్తం 29,575 మంది హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలను నో మొబైల్ జోన్లుగా పరిగణిస్తామన్నారు.



పెద్ద చదువులెందుకమ్మా.. అన్న అమ్మానాన్నలను ఆమె ఒప్పించింది. ఆడాళ్లకేం చేతనవుతుంది.. అన్న సమాజాన్ని మెప్పించింది. పాలన చేయగలరా.. అన్న అనుమానాలను పటాపంచలు చేసింది. చేతులకు గాజులు సంప్రదాయమే తప్ప సమర్థతకు అరదండాలు కానే కావని చాటి చెప్పింది. చీర కట్టు, నుదుట బొట్టు.. అంటూ మగ పుంగవులు వేసే వ్యంగ్య బాణాలను తన సత్తాతో తుత్తునీయలు చేసింది. వెరసి.. సిక్కోలు మహిళ అభ్యుదయ పథంలో పరుగులు తీస్తోంది. ఆమె విజయాలను కొలవగలిగే కొలమానాలు లేవు. ఆడపిల్లను పక్కింటికే పంపించని, ఎవరు ఏమనుకుంటారోనన్న సంకోచాలు, ఆంక్షల అడ్డుగోడలను ఛేదించి ఆమె వేస్తున్న ప్రతి అడుగూ విజయం వైపే. మహిళా దినోత్సవం సందర్భంగా కొందరు తరుణీ మణుల విజయ గాథలు..

తరుణీ తరుణం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

సిక్కోలు అతివలు అన్నింటా దూసుకుపోతున్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి, క్రీడలు..ఇలా అన్నింటిలోనూ సత్తా చాటుతున్నారు. ఐఏఎస్ అధికారులుగా, నృత్యకారులుగా, సైనికులుగా రాణిస్తున్నారు.

- శ్రమ నుంచి పరిశ్రమల వరకు వారే
- భూమ్మీద కాదు గగన వీధుల్లోనూ విజయ హాసం
- విద్య, వైద్యం, క్రీడలు, సేవలు, రక్షణ రంగాల్లో తమదైన ముద్ర
- చివరికి జిల్లా పాలనలోనూ కీలక పాత్ర

అత్యున్నత కొలువులో..


వేదిత


ప్రశాంతి


రాజకుమారి

యూపీఎస్‌సీ దేశంలోనే కష్టమైన పరీక్షల్లో ఒకటి. ఇందులో ర్యాంకు సాధించడం అంటే మాటలు కాదు. ఇలా కష్టపడి సివిల్స్‌లోనూ, ఇటు స్టేట్ గ్రూప్స్‌లో మంచి ర్యాంకులు సాధించిన సిక్కోలు వనితలు ఎంతో మంది ఉన్నారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కుమార్తె వేదిత ప్రస్తుతం అండమాన్ నికోబార్‌లో కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. మందస మండలం పిడి మందస గ్రామానికి చెందిన పుప్పాల ప్రశాంతి ప్రస్తుతం పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. మరో ఐఏఎస్ ఆఫీసర్‌గా నరసన్నపేటకు చెందిన అట్టాడ సిరి, ప్రశాంతి, గనియా రాజకుమారి ప్రస్తుతం కొలువుల్లో ఉండగా, ఐఎఫ్ఎస్ ఆఫీసర్‌గా సత్తారు అశ్విని కొనసాగుతున్నారు.

అందం, అభినయంలో..


స్వాతి సోమనాథ్

శాస్త్రీయ నృత్యాలను ఆదరించే వారికి కూచిపూడి నృత్యకారిణి స్వాతి సోమనాథ్ చిర పరిచితురాలు. ఆమదాలవలస మండలం దూసి గ్రామం నుంచి వచ్చిన స్వాతి సోమనాథ్ దేశం గర్వించదగ్గ నృత్యకారణిగా ఎదిగారు. తండ్రిని పేరులో కలుపుకుని ప్రపంచ వ్యాప్తంగా ప్రదర్శనలిస్తున్నారు. అలాగే పొందూరు మండలం కనిమెట్టలో జన్మించి, శ్రీకాకుళం బ్యాంకర్స్ కాలనీలోని చినబలందిలీపురంలో ఉంటున్న పైడి రజని అనే మహిళ మిస్ ఇండియా పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. క్లాసికల్ కేటగిరీలో ఏకంగా విజేతగా నిలిచారు.


పైడి రజని

క్రీడల్లో విశ్వకీర్తి


కరణం మల్లేశ్వరి


పూజారి శైలజ

మన వెయిట్ లిఫ్టింగ్ ఆణిముత్యాలు కరణం మల్లేశ్వరి, పూజారి శైలజల కీర్తి విశ్వవ్యాప్తం. 2000లో సిడ్నీలో జరిగిన ఒలింపిక్స్ పోటీల్లో కరణం మల్లేశ్వరి కాంస్య పత కం సాధించి దేశానికి వన్నె తీసుకొచ్చింది. పూజారి శైలజ 2002లో మాంచెస్టర్‌లో జరిగిన కామన్‌వెల్త్, 2004 లో ఏషియన్‌గేమ్స్‌లో బంగారు పతకాలతో మోత మోగించింది. మల్లేశ్వరిది ఆమదాలవలస మండల పరిధిలోని ఊసవానిపేట కాగా, పూజారి శైలజ ఆమదాలవలస మండలం వంజంగి గ్రామం.

ధైర్యప్రియ


హిమప్రియ

ఉగ్రదాడిని ధైర్యంగా ఎదుర్కొన్న సిక్కోలు అమ్మాయి కథ ఇప్పటికీ అందరికీ స్ఫూర్తిదాయకమే. శ్రీకాకుళంలోని పొన్నాం గ్రామానికి చెందిన గురుగు హిమప్రియ 2018 ఫిబ్రవరి 10న జమ్ము కశ్మీర్‌లో తన క్వార్టర్స్‌లోకి ప్రవేశించిన ఉగ్రమూకపై తిరగబడింది. దెబ్బలు తగిలినా వెరవకుండా తల్లితోపాటు తోటివారిని కాపాడేందుకు ప్రయత్నించింది. ఆ సాహసాన్ని కేంద్రం గుర్తించింది కూడా. అప్పట్లోనే నాటి భారత రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్వయంగా జమ్ములోని ఆర్మీ క్వార్టర్స్‌కు వెళ్లి, హిమప్రియ ఇంటిని సందర్శించి ఆ బాలికను, ఆమె తల్లిదండ్రులను అభినందించారు. గత ఏడాది బాలిక దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డును ఆమెకు అందజేశారు.

యోగాలోనూ..



ఆమదాలవలస పట్టణంలోని కాలేజీ వీధిలో నివాసముంటున్న యోగా క్రీడాకారిణి లగుడు లక్ష్మి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట పండించారు. 2001లో అనారోగ్యాన్ని దాటడానికి భర్త సాయంతో నేర్చుకున్న యోగాలో ఆమె ఇప్పుడు నిష్ణాతులయ్యారు. దేశ, విదేశాల్లో జరుగుతున్న పోటీల్లో పతకాల పంట పండిస్తున్నారు. 56 ఏళ్ల వయస్సులోనూ రాణిస్తున్నారు.

లాలనే కాదు పాలనలోనూ..

విద్య, వైద్యం, రక్షణ, రాజకీయం.. అన్ని రంగాల్లో సిక్కోలు పడతులు అదరగొడుతున్నారు. ఎంచుకున్న రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ జిల్లా ప్రగతిలో భాగస్వాములవుతున్నారు.
– అరసవల్లి, శ్రీకాకుళం న్యూ కాలనీ, శ్రీకాకుళం క్రైమ్, పాతబస్టాండ్



స్వచ్ఛమైన పాలన దిశగా..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం, ఆశయం మేరకు జిల్లా పరిషత్ పరిధిలో స్వచ్ఛమైన పాలన అందించేలా ప్రతి అడుగు వేస్తున్నాం. గత లంచగొండి పాలనకు స్వస్తి చెప్పాలనే.. లంచాలు తీసుకున్నవారి నుంచి తిరిగి ఇప్పించేలా చర్యలు చేపట్టాం. తద్వారా పారదర్శక పాలన అందించేలా కృషి చేస్తున్నాం. మహిళలు ఎంతటి బాధ్యతనైనా సమర్థంగా చెయ్యగలరని నిరూపిస్తున్నాను.
– పిరియా విజయ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

భద్రతే బాధ్యతగా..

మహిళల రక్షణే.. పోలీసుల ముఖ్య బాధ్యత. విధుల్లో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నా. వివిధ అంశాలపై విస్తృతమైన అవగాహన కల్పించి ప్రజల్ని, ముఖ్యంగా మహిళల్ని చైతన్యవంతుల్ని చేస్తున్నా. బాల బాలికలకు చిన్నారికి చేదోడు, విద్యార్థులకు క్యాంపస్ కాప్స్, స్ఫూర్తి పోలీసు కళా బృందంతో మహిళల భద్రత-మీ బాధ్యత వంటి కార్యక్రమాలతో వారిలో ధైర్యాన్ని నింపుతున్నాం. ఏహెచ్‌టీయూసీ, చైల్డ్‌లైన్, లేబర్ విభాగాల ద్వారా అనాధ బాలికలను గుర్తించి చేరదీస్తున్నాం. బస్సుల్లో, రైళ్లలో ఒంటరిగా వెళ్లే బాలికల వివరాలు తెలుసుకుని వాళ్లకి కౌన్సిలింగ్ చేసి ఇంటికి పంపించడం.. సారా తయారు చేస్తున్న వారి జీవితాల్లో మార్పుకోసం ఆపరేషన్ పరివర్తన్ (2.0) లాంటి అవగాహన కార్యక్రమాలతో జిల్లాకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నాం.
– జీఆర్ రాధిక, ఎస్పీ

జిల్లాలో వ్యాప్తంగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో వివిధ హోదాల్లో సేవలందిస్తున్న మహిళలు: **921**



ఆమె విద్యా'వారధి'గా..

డీఈఓ గార పగడాలమ్మ జిల్లాలో విద్యా వారధిగా నిలుస్తున్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూనే.. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను చేరవేయడంలో విజయవంతమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అద్భుతమైన ఫలితాలు రాబడుతున్నారు. జిల్లా విద్యాశాఖాధికారిగా పగడాలమ్మ పనిచేస్తున్న సమయంలో ముఖ్యంగా సర్కారీ విద్యా సంస్థలపై ప్రత్యేకంగా ఫోకస్ చేస్తున్నారు.



జిల్లాలో 2,655 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో సేవలందిస్తున్న మహిళా ఉపాధ్యాయులు: 4,449

జనులకు చేరువై..



జిల్లాలో ఏకైక మహిళా ఎమ్మెల్యేగా రెడ్డి శాంతి ప్రజల ఆదరణ చూరగొంటున్నారు. పాతపట్నం ఎమ్మెల్యేగా ఆమె నియోజకవర్గం నలుచెరగులా తిరుగుతూ సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. ఈ చొరవే ఆమెను జనాలకు దగ్గర చేస్తోంది.
– ఎల్.ఎన్.పేట

డాక్టరమ్మలే ఎక్కువ..



వైద్య వృత్తిలో జిల్లాలో మహిళలే ఎక్కువగా ఉన్నారు. దశాబ్ద కాలంలో ఇదో పెద్ద మార్పు. ఒక్క ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వంద మందిలో 60 మంది మహిళలే వైద్యులుగా సేవలందిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం మహిళలకు ఇస్తున్న ప్రోత్సాహం గొప్పది. కరోనా లాంటి విపత్తును ఎదుర్కొని ఎందరో ప్రాణాలను కాపాడిన వారిలో మహిళలు అధికంగా ఉండడం గొప్ప విశేషం.
– డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డీఎంహెచ్ఓ

జిల్లాలో 83 మంది మహిళా మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు 636, ఆశ వర్కర్లు 2234, సూపర్‌వైజరీ స్టాఫ్ 173, స్టాఫ్ నర్సులు 153, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు 589 సేవలందిస్తున్నారు.

అతివకు అగ్రతాంబూలం

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైఎస్సార్ సీపీ సర్కారు సంక్షేమ పాలనలో అతివలకు అగ్రతాంబూలం లభిస్తోంది. పిల్లలను బడికి పంపే తల్లి దగ్గర నుంచి సొంతంగా వ్యాపారం నిర్వహించే పడతి వరకు అందరికీ ప్రభుత్వం అండగా ఉంటోంది.

- బ్యాంకుల ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు జిల్లాలో 35,064 సంఘాలకు గాను రూ.1006.95 కోట్లను రుణ రూపంలో అందజేశారు.
- స్త్రీ నిధి ద్వారా ఈ ఏడాది జిల్లాలో 9874 సంఘాల సభ్యులు 36,280 మంది సభ్యులకు రూ.158.95 కోట్లను రుణంగా అందించారు.
- సున్నా వడ్డీ రాయితీకి సంబంధించి తొలి విడతలో రూ.26.914 కోట్లు, రెండో విడతలో రూ.26,757 కోట్లు, మూడో విడతలో రూ.31.9 కోట్లను మహిళల ఖాతాలకు జమ చేశారు.
- డ్వాక్రా రుణాలకు సంబంధించి వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా తొలి విడతలో 38,647 సంఘాల్లోని 4,31,734 మంది సభ్యులకు గాను రూ.280.36 కోట్లు, రెండో విడతలో 38,647 సంఘాల్లోని 4,31,734 మంది సభ్యులకు గాను రూ.280.36 కోట్లు చెల్లించారు. ఇంకో రెండు విడతలు ఉన్నాయి.
- చిన్న వ్యాపారం చేసుకోవాలనే మహిళలకు జగనన్న తోడు పథకంలో 2020 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు ఐదు పర్యాయాలు రుణాలు అందించారు. మొత్తం 69,745 మంది చిరు వ్యాపారులకు గాను రూ.69.75 కోట్ల రుణాలు కల్పించి, వాటికి వడ్డీలు కూడా ప్రభుత్వమే చెల్లిస్తోంది.
- వైఎస్సార్ చేయూత ద్వారా తొలివిడతలో 1,19,417 మందికి గాను రూ.358.90 కోట్లు, రెండో విడతలో 1,97,997 మందికి గాను 371.24 కోట్లు, మూడో విడతలో 1,70,208 మందికి గాను రూ.319.31 కోట్లు అందించారు.
- ఎస్సీ, ఎస్టీ మహిళల ఆర్థికాభివృద్ధికి ఉన్నతి పథకం ద్వారా జిల్లాలో ఎస్సీ సభ్యులు 1566 మందికి రూ.689.50 లక్షలు, ఎస్టీ సభ్యులకు 258 మందికి రూ.120.35 లక్షలు అందజేశారు.
- సచివాలయాల్లో 3105 మంది మహిళలకు ఉద్యోగాలు కల్పించారు.
- దిశ యాప్‌ను అందరి ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించి మహిళల భద్రతకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 10,46,548 మంది దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. 3,02,305 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇప్పటివరకు 690 కాల్స్ ద్వారా బాధితులు, వారి బంధువులు ఫిర్యాదు చేయగా వారి సమస్యలు పరిష్కరించామని శ్రీకాకుళం దిశా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎస్.వాసుదేవ్ తెలిపారు.

నింగీ.. నేలా.. నాదే



సాహ'షి'వే..

మహిళలు ఉద్యోగాలు చేస్తున్నారు గానీ రక్షణ రంగంలో వీరి ప్రాతినిధ్యం తక్కువగానే ఉండేది. ఇప్పుడు ఆ లోటు కూడా తీరిపోతోంది. జిల్లా నుంచి కూడా అమ్మాయిలు సైనిక దుస్తుల్లో మెరిసిపోతున్నారు. దేశ సరిహద్దుల్లో ఎముకలు కొరికే చలిలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలు అందిస్తున్నారు. రాత్రి సమయాల్లో సైతం ఒంటరిగా పహారా కాస్తున్నారు. దేశానికి రక్షణ కల్పించడం గర్వంగా ఉందంటూ కుసుమూరి స్రవంతి, పి.హేమలత వంటి వారు చెబుతున్నారు.
– వజ్రపుకొత్తూరు రూరల్

ఫైటర్



కవిటి: స్క్వాడ్రన్ లీడర్.. ఇలా పిలిపించుకోవడమే ఓ గౌరవం. ఆ గౌరవం హిరమండలానికి చెందిన సీఐఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటరావు, విజయలక్ష్మిల కుమార్తె కృష్ణకుమారికి దక్కింది. కవిటి మండలం బల్లిపుట్టుగకు చెందిన ముద్దపు శ్రీరామ్మూర్తి, ఝాన్సీ ఇంటికి కోడలుగా వచ్చిన ఆమె ఫైటర్ జెట్ నడపడంలో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. చిన్నతనం నుంచే కృష్ణకుమారికి విమాన రంగం అంటే మక్కువ. తండ్రి కూడా ఆమెను కిరణ్‌బేడీతో పోల్చేవారు. ఇలా చక్కటి వాతావరణంలో పెరిగిన ఆమె తన కలను సాకారం చేసుకున్నారు. చక్కగా ఇంజి 2015లో స్క్వాడ్రన్ లీడర్‌గా ఎంపికయ్యారు. 2017లో శిక్షణ అనంతరం విధుల్లో చేరారు. దేశ వ్యాప్తంగా విధులు నిర్వహించారు.

బతుకును బాగు చేసుకుంది..



మగాళ్ల రాజ్యమైన మోటారు ఫీల్డ్‌లో ఓ ఇల్లాలు తన కంటూ స్థానాన్ని సంపాదించింది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మెకానిక్ రాధ అంటే తెలియని వారు ఇప్పుడు లేరు. కోవిడ్ కాలం ఆ కుటుంబాన్ని కష్టాల్లో పడేస్తే.. అందులో నుంచి బయటకు తీసుకురావడానికి భర్తకు తోడుగా ఆమె కూడా మెకానిక్ విద్య నేర్చుకున్నారు. పెనిమిటికి తోడుగా దుకాణానికి వెళ్లి బళ్లను రిపేర్ చేయడం మొదలుపెట్టారు. అలా వాహనాలతోపాటు తమ బతుకులను కూడా వారు బాగు చేసుకున్నారు. సందేహాలు వస్తే గూగుల్, యూట్యూబ్‌లో వీడియోలు చూసి నేర్చుకున్నారు. ఇప్పుడు రిపేర్లలో ఆరితేరిపోయారు.
కాశీబుగ్గ

పరిగెత్తే ట్రైన్.. నడిపించే క్వీన్



కాశీబుగ్గ: అమ్మాయిలపై ఉన్న చిన్నచూపే తాను ఓ విభిన్న మార్గాన్ని ఎన్నుకునేందుకు కారణమైందని అంటున్నారు లోకో పైలెట్ మరడ వాణిరెడ్డి. ఆమె పలాస రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌లో ఎలక్ట్రికల్ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తి చేశానని, తన తల్లి రుక్మిణి వెన్నెముకలా ఉండి తనను ప్రోత్సహించారని ఆమె తెలిపారు. ఆమెకు వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీ పరిధిలో వెంకటాపురం గ్రామానికి చెందిన మరడ వెంకటరావుతో వివాహమైంది. ఆయన ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. భర్త ప్రోత్సాహంతోనే తాను సాఫీగా ఉద్యోగం చేస్తున్నానని ఆమె చెప్పారు. ప్రస్తుతం ఈస్ట్‌కోస్టు రైల్వే ఖుర్దా రైల్వే డివిజన్ పరిధిలో పలాస రైల్వేస్టేషన్ పరిధి రైలును నడుపుతున్నానని తెలిపారు. రోజుకు 220 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తానని, పలాస నుంచి భువనేశ్వర్ వరకు రైలు నడిపి అక్కడ విరామం అనంతరం తిరిగి పలాస చేరుకోవడంతో రోజువారీ పని పూర్తవుతుందని పేర్కొన్నారు. మహిళలు స్ట్రాంగ్ మైండ్‌సెట్‌తో ఉండాలని ఆమె సూచించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: మండలంలోని నౌపడ ఆర్ఎస్ రైల్వే గేటు వద్ద మంగళవారం మధ్యాహ్నం రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి సుమారు 35 ఏళ్ల వ్యక్తి రైలు నుంచి జారిపడి పట్టాల పక్కన ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే రైల్వే గేటుమేన్ శ్రీనివాసరావుకు సమాచారం అందించారు. అనంతరం 108లో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్రగాయం కావడంతో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నీలం రంగు షర్ట్, కాఫీకలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతుని వివరాలు తెలియలేదని జీఆర్‌పీ ఎస్ఐ షరీఫ్ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆవు కడుపులో 20 కిలోల వ్యర్థాల తొలగింపు

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు గ్రామ పశువుల వైద్యుడు లఖినేని కిరణ్‌కుమార్ ఒక ఆవు కడుపులోనున్న 20 కిలోల వ్యర్థ పదార్థాలను ఆపరేషన్ చేసి బయటకు తీసి గోవు ప్రాణాలు కాపాడారు. పోలాకి మండలం ఇలపండపేటకు చెందిన ఇలపండ భాస్కరరావుకు చెందిన పాడి ఆవు కొంతకాలంగా రోడ్లుపై పడిన పాలథీన్ కవర్లు, ప్లాస్టిక్ ముక్కలు తినేయడం వల్ల జీర్ణక్రియ జరగక వారం రోజులుగా కడుపు నొప్పితో ఇబ్బంది పడుతోంది. సోమవారం రాత్రి పరిస్థితి విషమించడంతో ఆవును కురుడు పశువుల ఆస్పత్రికి తీసుకువచ్చారు. వెంటనే డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ స్పందించి ఆవుకు ఆపరేషన్ చేసి వ్యర్థాలను తొలగించి ప్రాణాలు నిలబెట్టారు.

వైభవంగా వల్లభుని డోలోత్సవం

మందస: ఉద్దాన ప్రాంతంలో ప్రసిద్ధమైన రట్టి యాత్రకు భక్తులు పోటెత్తారు. సోంపేట, మందస, కంచిలి, కవిటి, పలాస, వజ్రపుకొత్తూరు, కవిటి, ఇచ్ఛాపురం, బరంపురం, మెళియాపుట్టి, శ్రీకాకుళం, టెక్కలి, నందిగాం తదితర మండలాల నుంచే కాకుండా ఒడిశా నుంచి కూడా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. సమీపంలోని సముద్రంలో స్నానాలు చేసి సందడిగా గడిపారు. స్వామిని మంత్రి సీదిరి అప్పలరాజు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు ఎంపీడీ డొక్కరి దానయ్య, జడ్పీటీసీ సవర చంద్రమ్మ, సర్పంచ్ మామిడి సింహాద్రి, ఉపసర్పంచ్ చీకటి మోహనరావు, ఎంపీటీసీ సూరాడ వాసు, పూజారి సీతారాం, పార్టీ నాయకులు పులారి కూర్మారావు, పీతాంబరం, సార దూర్వాసులు, కొల్లి మోహనరావు, మామిడి భగీరథి, రట్టి వైకుంఠరావు, సార మాధవరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


వల్లభనారాయణునికి ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

సందడిగా పుణ్య స్నానాలు

గార: శ్రీకూర్మనాథుని డోలోత్సవాల్లో రెండో రోజు మంగళవారం సముద్ర స్నానాలతో భక్తులు పరవశించారు. సోమవారం రాత్రి కామదహనోత్సవంలో పాల్గొన్న వారు వేకువజాము నుంచి సమీపంలోని సముద్రంలో పుణ్య స్నానాలు చేశారు. అనంతరం శ్రీకూర్మనాథుని సన్నిధిలో ఉన్న శ్వేత పుష్కరిణిలో స్నానాలు చేసి స్వామిని దర్శించుకున్నారు. వన్‌టౌన్ సీఐ ఎల్.సన్యాసినాయుడు, ఎస్ఐ ఎం.మధుసూదనరావుల పర్యవేక్షణలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు. నేడు లక్ష్మీదేవి ఉద్భవించిన రోజు కావడంతో సముద్ర స్నానాలకు భక్తులు పోటెత్తే అవకాశం ఉంది.


సముద్ర తీరంలో భక్తులు